క్లుప్తంగా

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



మక్తల్: సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డిని బుధవారం హైదరాబాద్‌లో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మక్తల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం తన వంతు సహకారం చేస్తానని సీఎం భరోసా ఇచ్చారని తెలిపారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

హిందుపూర్‌లో భీమ కోరేగావ్ విజయ్ దివాస్

కృష్ణా: మండలంలోని హిందుపూర్‌లో బుధవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో భీమ కోరేగావ్ విజయ్ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1818లో అగ్రకుల పీష్వాల అణిచివేతకు వ్యతిరేకంగా భీమ కోరేగావ్ యుద్ధంలో దళితులు పాల్గొని విజయం సాధించడం జరిగిందన్నారు. దళితుల్లో మనోధైర్యం నింపిన భీమ కోరేగావ్ యుద్ధంను విజయ్ దివాస్‌గా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఆ సంఘం నాయకులు అనిల్, బుషప్ప, తదితరులు పాల్గొన్నారు.

అప్పంపల్లిని రెవెన్యూ గ్రామంగా గుర్తించాలి

మరికల్: మండలంలోని అప్పంపల్లి గ్రామానికి రెవెన్యూ గ్రామంగా గుర్తించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డిలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అప్పంపల్లికి చెందిన రైతుల భూములు మందిపల్లి, మరికల్, కిష్టాపూర్, పస్పుల, మాధవరం గ్రామాల శివారులో ఉండటం వల్ల పంట రుణాలు, ఆర్‌ఓఆర్‌లు, పహణీలు తీసుకోవాలంటే అధికారుల చుట్టూ తిరగలేకపోతున్నామని వాపోయారు. మరికొన్ని కొత్త మండలాలను ఏర్పాటు చేయబోతున్న రాష్ట్ర ప్రభుత్వం అప్పంపల్లిని రెవెన్యూ గ్రామంగా మార్చాలని వారు కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నారాయణపేట రూరల్: కాకర్ల వెల్ఫేర్ ట్రస్ట్, అఖిల భారత అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో సంయుక్తంగా రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కాకర్ల భీమయ్య విడుదల చేశారు. పట్టణ శివారులోని శబరిపీఠం సన్నిధానంలో అయ్యప్ప స్వాముల మధ్య ఆవిష్కరించి వారికి పంపిణీ చేశారు. వెంకటేష్, బాలాజీ, కన్నయ్య, శంకర్ రెడ్డి, బాబు, కిషోర్, తిప్పన్న శ్రీనివాస్, కృష్ణ, బాలు పాల్గొన్నారు.

3న ఉచిత కంటి వైద్య శిబిరం

అమరచింత: పట్టణంలోని డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ఆస్పత్రిలో ఈనెల 3న దేశాయి ప్రకాష్ రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షుడు కలాం పాషా తెలిపారు. కందూర్ రాంరెడ్డి లయన్స్ క్లబ్ ఏనుగొండ మహబూబ్‌నగర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండలంలోని ఆ యా గ్రామాల్లో కంటిచూపు, కంటి సమస్యలతో బాధపడతున్న ప్రతి ఒక్కరు హాజరై వైద్య సేవలు పొందాలని కోరారు. ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకొని రావాలని సూచించారు.

చికెన్ వ్యర్థాలతో ప్రాణాలకు ముప్పు

అడ్డాకుల: అడ్డాకుల శివారులోని ఉన్న ఓ చికెన్ పరిశ్రమ ద్వారా వెలువడే వ్యర్థాలతో ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచిఉందని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని బలీదుపల్లిచెరువు వద్ద చికెన్ పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ ఈకంపెనీపై పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కంపెనీ వ్యర్థాలను పొలాల్లో వదలడంతో బలీదుపల్లి, పెద్దమునుగల్‌ఛేడ్ వాగులో చేరి అక్కడి నుంచి సరళాసాగర్ మీదుగా రామన్‌పాడు ప్రాజెక్టులోకి చేరుతున్నాయని తెలిపారు. తాగునీటిలో వ్యర్థాలు చేరడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి పరిశ్రమ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

- నియోజకవర్గ ప్రజలకు ప్రముఖుల శుభాకాంక్షలు

మక్తల్: నియోజకవర్గంలో నూతన సంవత్సర సందర్భంగా ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకొని ఘనంగా స్వాగతం పలికారు. మక్తల్, నర్వ, ఆత్మకూర్, ఊట్కూర్, మాగనూర్, కృష్ణా మండలాల్లోని గ్రామాల ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మక్తల్‌లో శ్రీ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయంలో మక్తల్ మండలంలో విద్యార్థులు, యువకులు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వమించారు. అర్ధరాత్రి దాటిన తర్వాత నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ యువకులు బాణాసంచా కాల్చుతూ న్యూ ఇయర్ కేక్‌లు కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి, బీకేఆర్ చైర్మన్ బాలక్రిష్ణారెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ పావని, వైస్ చైర్ పర్సన్ అఖిలారెడ్డి, రాజుల ఆశిరెడ్డి, మక్తల్ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని మాద్వార్, లింగంపల్లి, సోమేశ్వర్ బండ, గుడిగండ్ల, ఉప్పర్‌పల్లి, అనుగొండ, సామన్‌పల్లి, ఖానాపూర్, చందాపూర్, జక్లేర్ గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మక్తల్ సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ భాగ్యలక్ష్మారెడ్డి, గట్టి బందోబస్తు నిర్వహించారు.



మక్తల్‌లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని సన్మానం చేస్తున్న భక్తులు

ఊట్కూరు: మండలంలో నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఊట్కూరు, పులిమామిడి, బిజ్వార్, కొల్లూరు, పెద్ద జట్రం తదితర గ్రామాలలో ప్రజలు దేవాలయాలలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఊట్కూరు, కొల్లూరు చర్చిలలో కేక్ కట్‌చేసి నూతన సంవత్సర వేడుకలు నిర్వించారు. సింగిల్‌విండో కార్యాలయంలో వేడుకల సందర్భంగా మిఠాయిలు రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విండో అధ్యక్షులు బాల్‌రెడ్డి, దేవదానం, సురేష్‌లు, జనార్దన్, హుస్సేన్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

➩ మరికల్ మండలంలో ఘనంగా నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. అర్ధరాత్రి వరకు యువకుల కేరింతల మధ్య నూతన ఏడాది వేడుకలను నిర్వహించారు.



సింగిల్‌విండో కార్యాలయంలో మిఠాయిలు తినిపిస్తున్న అధికారులు

ధన్వాడ: కొత్త సంవత్సరం సందర్భంగా మండలంలోని యంనోనిపల్లి గ్రామంలో కూలీలు పంట పొలంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి కొత్త సంవత్సరం పంటలు బాగా పండి దిగుబడి బాగా రావాలని కోరుకున్నారు. అలాగే మండలంలోని దేవాలయలు నూతన సంవత్సరం సందర్భంగా భక్తులతో కటకిటలాడాయి.



మరికల్‌లో కేక్‌కట్ చేస్తున్న చిన్నారులు



కేక్ కట్ చేస్తున్న కూలీలు



ఊట్కూరులోని చర్చిలో నూతన సంవత్సర వేడుకలు



మక్తల్‌లో కెక్ కట్ చేస్తున్న దృశ్యం

కోయిల్‌సాగర్ కింద యాసంగి జోరు



కోయిల్‌సాగర్ కింద వరినాట్లు వేస్తున్న కూలీలు

మరికల్: కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద వరి నాట్లు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గతనెల 25న మొదటి విడత నీరు వదలడంతో రైతులు వరిసాగు పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే బోరు బావుల కింద రైతులు నాట్లు వేసే పనుల్లో ఉన్నారు. నెల రోజుల నుంచి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పడిపోవడంతో చలి మంచు తీవ్రతకు నారుమళ్లు పెరుగుదలపై ప్రభావం చూపింది. అనేక రకాల తెగుళ్ల రావడంతో నారుమళ్లను కాపాడుకోవడం కోసం రైతులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం నారుమళ్ల పెరగడంతో కోయిల్‌సాగర్ పాత ఆయకట్టు వరకు వరినాట్లు వేసే పనిలో రైతులు బిజిబిజిగా ఉన్నారు. వరినాట్లు ఒకేసారి రావడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. కేఎస్పీ కుడి, ఎడమ కాల్వల ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై అధికారులు దృష్టి సారించి చివరి ఆయకట్టు వరకు నీళ్ల అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

క్రీడలతో ఆరోగ్యకరమైన జీవితం

నారాయణపేట రూరల్: ప్రతిరోజు ఆటలు ఆడటం వల్ల శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని పీవైఎల్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కాశీనాథ్ అన్నారు. మండలంలోని కోటకొండ గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్‌ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే పాఠశాలల్లో చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. యువత క్రికెట్ తో పాటు మిగిలిన అన్ని రకాల ఆటలపై శ్రద్ధ చూపించాలన్నారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి అలవాట్లను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, నాయకులు సాయికుమార్, గౌస్, వెంకటేష్, చెన్నారెడ్డి, నారాయణ, నరసింహ, అంజి, వెంకటప్ప పాల్గొన్నారు.



కోటకొండలో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న కాశీనాథ్

అధ్యాపకుల సంఘం జిల్లా ఇన్‌చార్జిగా సాంబశివుడు

ధన్వాడ: తెలంగాణ బీసీ లెక్చరర్స్ అసోసియేషన్ నారాయణపేట జిల్లా ఇన్‌చార్జిగా ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు సాంబశివుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఎన్నికలో ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రం అందజేశారని ఆయన తెలిపారు. తనపై నమ్మకంతో జిల్లా బాధ్యతలు ఇచ్చిన రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య, అధ్యక్షులు సుదర్శన్‌కి ధన్యవాదాలు తెలిపారు. అధ్యాపకుల సమస్యల సాధన కోసం సంఘం తరపున కృషి చేస్తానన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న సాంబశివుడు

జీన్స్ టీషర్టులు వద్దు.. సాంప్రదాయమే ముద్దు

నర్వ: దేవాలయాలకు వచ్చే భక్తులు జీన్స్, టీ షర్ట్స్ వద్దు... సాంప్రదాయమే ముద్దు అని లంకాల్ గ్రామ రామంజనేయస్వామి అర్చకులు శివయ్య స్వామి అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ప్రత్యేక స్లోగన్‌తో ఉన్న ఫ్లెక్సిని ఏర్పాటు చేసి భక్తులకు సూచనలు చేశారు. నేను సైతం అనే స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు దిడ్డి ప్రవీణ్‌కుమార్ ఆలయానికి దూపదీప నైవేద్య కార్యక్రమానికి వితరణ చేశారన్నారు. కొత్త ఏడాదిలో ఆలయాలకు వచ్చే భక్తులు మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుతూ ఆలయాలకు రావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.



లంకాల్ గ్రామంలో సాంప్రదాయ దుస్తులను ధరించి ఆలయానికి రావాలని సూచిస్తున్న అర్చకులు

కరాటే చాంపియన్‌షిప్ బ్రోచర్ ఆవిష్కరణ



కరాటే టోర్నీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న హీరో సుమన్

స్టేషన్ మహబూబ్‌నగర్: జీకే మాస్టర్ షోటోకాన్ కరాటే దూ ఇండియా ఆధ్వర్యంలో వచ్చేనెల 2న జడ్చర్ల పట్టణంలో 21వ నేషనల్ లెవల్ ఇన్విటేషన్ కరాటే చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నట్లు టోర్నీ చీఫ్ ఆర్గనైజర్ సయ్యద్ అశ్వాక్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో కరాటే చాంపియన్‌షిప్ బ్రోచర్లను సినీహీరో సుమన్ ఆవిష్కరించారు. కరాటే చాంపియన్‌షిప్‌ను విజయవంతంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. అశ్వాక్ మాట్లాడుతూ ఈ కరాటే టోర్నమెంట్‌లో వివిధ రాష్ట్రాల నుంచి కరాటే విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జీకే మాస్టర్ షోటోకాన్ ఆలిండియా సెక్రటరీ, సీనియర్ కరాటే మాస్టర్ ఇలియాజ్ బిన్ సిద్దిఖీ, కరాటే మాస్టర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

రూ.5.16 లక్షల కనకాభిషేకం

మక్తల్: పట్టణంలో బుధవారం జరిగిన అయ్యప్పస్వామి మహా పూజ సందర్భంగా నిర్వహించిన కనకాభిషేకం డబ్బులను రూ.5.16 లక్షలకు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పి నరసింహగౌడ్ దక్కించుకున్నారు ఈ సందర్భంగా వారిని గురు స్వాములు అశోక్‌గౌడ్, టి అనిల్, గణేష్, రవికుమార్, నీలగౌడ్ శాలువాతో సత్కరించారు. భక్తులకు అన్నదానం నిర్వహించడం పట్ల అయ్యప్ప స్వాములు వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

కూరగాయల సాగుపై అవగాహన కల్పించాలి

మరికల్: ఉద్యానవన శాఖ అధికారులు కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు పద్మనాభంరెడ్డి, యాదవరెడ్డిలు అన్నారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ రైతులకు కూరగాయల సాగుపై అవగాహన లేకపోవడంతో ప్రస్తుతం మార్కెట్‌లో వాటి ధరలు మండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణ పంటలు తప్ప రైతులు ఎవరూ కూడా కూరగాయల సాగుపై దృష్టికి పెట్టకపోవడం కారణం ఉద్యానవన శాఖ అధికారుల తప్పిదమే అన్నారు. మండలంలో ప్రతి గ్రామంలో తోటల విస్తీర్ణం పెరిగేలా ఉద్యాన వన శాఖ అధికారులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

తపస్ జిల్లా కార్యదర్శిగా శేషప్ప



నారాయణపేట ఎడ్యుకేషన్: తపస్ జిల్లా కార్యదర్శిగా శేషప్ప నియమితులైనట్లు నారాయణపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేర్ క్రిష్ణారెడ్డి, నరసింహలు తెలిపారు. శేషప్ప చిన్నపొర్ల ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కార్యదర్శిగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. జిల్లావ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ నాయకులు పాల్గొని ఆయనను అభినందించారు.

ఉపాధి హామీ మేటీల కార్యవర్గం ఎన్నిక

ఊట్కూరు: మండలంలోని ఉపాధిహామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న మేటీలు బుధవారం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా శంకర్, ఉపాధ్యక్షులుగా ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శి సీతారాంనాయక్, కార్యదర్శి జగదీశ్, రాజు, కార్యవర్గ సభ్యులు మహేష్, నర్సింహులు, కృష్ణను ఎన్నుకున్నారు.

రామలింగేశ్వరుడి సన్నిధిలో న్యాయమూర్తి

అడ్డాకుల: మండలంలోని కందూర్ సమీపంలో స్వయంభూగా వెలిసిన శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయాన్ని బుధవారం సబ్‌కోర్టు సివిల్ జడ్జి రాధిక కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ పూజారులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. శివలింగానికి అభిషేకం చేయించారు. అనంతరం గౌరమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో ఉన్న కల్పవృక్షం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పండితులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

శబరిమలకు అయ్యప్ప మాలధారులు



ఇరుముడులతో శబరిమలకు బయలు దేరిన మద్దూరు అయ్యప్ప స్వాములు

మద్దూరు: కార్తీక మాసంలో అయ్యప్పమాల ధరించిన అయ్యప్ప స్వాములు శబరిమలకు బుధవారం బయలు దేరారు. ఈ సందర్భంగా మద్దూరు పాత బస్టాండ్ ఆంజనేయస్వామి దేవాలయంలో మహేష్, విష్ణు, సత్తిగౌడ్, గణప శ్రీను గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప మాలదారులు ఇరుముడులు కట్టుకొని బయలు దేరారు. ఈ సందర్భంగా మద్దూరు పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ వరకు అయ్యప్ప మాల దారులు ఇరుముడులతో బయలు దేరారు. మద్దూరు నుంచి 40 మంది అయ్యప్ప మాలదారులు శబరిమలకు బయలు దేరారు. బయలు దేరిన స్వాముల్లో చికిని అంజయ్య, జీడీ ప్రకాష్, రామకృష్ణ, గణప చందు, లాలు, బీమేష్, నర్సింహ తదితర స్వాములు శబరిమలకు బయలు దేరారు.

విద్యార్థులకు బోధన కరువు



కేజీబీవీలో చదువుకుంటున్న విద్యార్థినులు

- సమ్మెలో కేజీబీవీ ఉద్యోగులు

పాన్‌గల్: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పనిచేసే ప్రత్యేకాధికారులు(ఎస్‌ఓ), కాంట్రాక్టు రెసిడెంట్ టీచర్లు(సీఆర్‌టీలు), పీజీ సీఆర్‌టీలు, ఇతర బోధనేతర సిబ్బంది తమ సమస్యల పరిష్కారం కోసం 23 రోజులుగా సమ్మె చేస్తున్నారు. దీంతో విద్యార్థినులకు పాఠాలు బోధించేవారు కరవయ్యారు. సమ్మె చేస్తున్న వారి విషయమై ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టమైన హామీ ఇవ్వలేదు. దీంతో సమ్మె ఎన్ని రోజులు కొనసాగుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఆందోళన ఇలాగే కొనసాగితే విద్యా ప్రమాణాలు పడిపోయే ప్రమాదం ఉందని విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండల పరిస్థితి..

మండల కేంద్రంలో ఉన్న కస్తూర్బా విద్యాలయంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కొనసాగుతోంది. విద్యాలయంలో 212 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వారికి పాఠాలు బోధించడానికి 13 మంది సీఆర్‌టీలు పని చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని సమగ్ర శిక్ష ఆధీనంలో ఉన్న కేజీబీవీ ఉద్యోగులు, ఎమ్మార్సీ కార్యాలయంలో పనిచేస్తున్న సీఆర్‌పీలు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, ఐఈఆర్‌పీలు సమ్మె చేస్తుండటంతో మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం కూడా మూతపడింది. విద్యా శాఖకు సంబంధించిన పలు నివేదికలు తయారు చేయడం అధికారులకు ఇబ్బందిగా మారింది.

ఫలితాలపై ప్రభావం..

బోధన సిబ్బంది సమ్మెలో పాల్గొనడంతో పదో తరగతి ఫలితాలపై ప్రభావం పడుతుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థినులకు పాఠాలు చెప్పేవారు లేకపోవడంతో వారు నోట్స్ రాసుకుంటూ కాలం గడుపుతున్నారు.

నేడు చలో మున్సిపల్ ముట్టడి

అమరచింత: ప్రభుత్వం ప్రకటించిన ఉచిత విద్యుత్ జీరో బిల్లు, గ్యాస్ సబ్సిడీలు అందక ప్రజలు సతమతమౌతున్నారని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని గురువారం చలో మున్సిపల్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాస్‌లైన్ పార్టీ మండల కార్యదర్శి రాజన్న తెలిపారు. పట్టణంలోని ఆయా వార్డులలో బుధవారం ఇంటింటికి వెళ్లి గ్యాస్ సబ్సిడీ, జీరో బిల్లులు వర్తిస్తున్నాయా లేదా అన్న విషయాలను ఇంటి యాజమానులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీ ఇస్తున్నామని చెబుతున్న ఇందుకు మున్సిపల్ అధికారులు సకాలంలో వాటి వివరాలను పంపకపోవడంతో సబ్సిడీ అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం బాధిత లబ్ధిదారులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు పాల్గొని సమస్యను పరిష్కరించే వరకు పోరాడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు ప్రసాద్, భక్తి, కురుమన్న, సామేలు, మసలమని, రాంచందర్, జిలాని, ప్రేమరత్నం, పలువురు పాల్గొన్నారు.



ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకుంటున్న మాస్‌లైన్ పార్టీ నాయకులు

కొనసాగిన యూనియన్ బ్యాంక్ సేవలు

అమరచింత: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో బుధవారం బ్యాంకు సేవలు యథావిధిగా కొనసాగాయి. మూడు రోజుల క్రితం బ్యాంకులో చోరీకి విఫలయత్నం కావడంతో రెండు రోజులు బ్యాంకు సేవలు నిలిపేశారు. బుధవారం యథావిధిగా అధికారులు ఖాతాదారులకు సేవలు అందించారు. బ్యాంకులో సీసీ కెమెరాల పునరుద్ధరణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. వినియోగదారులకు సేవలు అందిస్తున్నామని బ్యాంకు మేనేజర్ శివశంకర్ తెలిపారు.



అమరచింత యూనియన్ బ్యాంకులో సేవలు పొందుతున్న ఖాతాదారులు